సాక్షి
వికారాబాద్

బుధవారం । 7 । ఆగస్టు । 2024



రేషన్ బియ్యం పక్కదారి!

పేదల ఆకలితీర్చాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నాయి. 8లో▸



భాగస్వాములవ్వాలి

స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ట్రయినీ కలెక్టర్ ఉమహారతి కోరారు. 8లో▸



జోరందుకున్న వరినాట్లు

పెద్దేముల్ మండలంలో వరినాట్లు జోరందుకున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఈసారి సన్నవడ్ల సాగుపై ఆసక్తి చూపారు. 9లో▸

న్యూస్‌రీల్

నేటి నుంచి సదరం స్లాట్ బుకింగ్



అనంతగిరి: సదరం క్యాంపులకు వచ్చే దివ్యాంగులు బుధవారం ఉదయం 11గంటల నుంచి మీ సేవా కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8, 16, 22, 29, 31వ తేదీల్లో అలాగే సెప్టెంబర్ 12, 19, 26, 28, 30 తేదీల్లో తాండూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో సదరం క్యాంప్‌లు నిర్వహించనున్నట్లు తెలిపారు. వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఈ నెల 8, 14, 20, 22 తేదీల్లో, అలాగే సెప్టెంబర్ 12, 17, 19, 24 తేదీల్లో సదరం క్యాంపులు ఉంటాయని తెలిపారు. ముందుగా స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. ఇదివరకు సర్టిఫికెట్ పొంది కాల పరిమితి పూర్తయిన వారి కూడా స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు.

కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేసిన డీఈఓ



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ రేణుకాదేవి

దౌల్తాబాద్: మండలంలోని బాలంపేట కస్తూర్బా పాఠశాలను మంగళవారం డీఈఓ రేణుకాదేవి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. నాణ్యమైన భోజనం అందడం లేదని విద్యార్థులు డీఈఓకు వివరించారు. ఇకపై ఇలా జరగకుండా చూసుకోవాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎస్‌ఓ బసమ్మ, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

రుణమాఫీ అయ్యేలా చూడండి



స్పీకర్‌కు వినతిపత్రం ఇస్తున్న వెంకట్‌రెడ్డి

ధారూర్: ఆన్‌లైన్ నమోదులో జరిగిన పొరపాటు కారణంగా 71మంది రైతులకు రుణమాఫీ అమలు కాలేదని, ఈ సమస్యను పరిష్కరించాలని హరిదాసుపల్లి పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి మంగళవారం నగరంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ప్రకటించిన రుణమాఫీ జాబితాలో తమ సొసైటీకి చెందిన 71మంది రైతుల పేర్లు లేవని తెలిపారు. ఇంటెలెక్ట్ సాఫ్ట్‌వేర్‌లో అక్టోబర్ 9కి బదులు డిసెంబర్ 9న రైతుల రుణాలు రెన్యువల్ అయినట్లు నమోదు కావడంతో 71మంది రైతుల పేర్లు వ్యవసాయ శాఖ వెబ్‌సైట్‌లో కనిపించ లేదని ఆయన స్పీకర్ దృష్టికి తెచ్చారు. ఈ సమస్యను పరిష్కరించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయమై వ్యవసాయ శాఖ కమిషనర్‌తో మాట్లాడి రైతులకు రుణమాఫీ అయ్యేలా చూస్తానని స్పీకర్ హామీ ఇచ్చారని వెంకట్‌రెడ్డి తెలిపారు.

అదనపు కట్నం కోసం అత్తింటి వేధింపులు

- మనస్తాపంతో ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య
- మృతురాలు నాలుగు నెలల గర్భిణి

మీర్‌పేట: అదనపు కట్నం వేధింపులు తాళలేక ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు, ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం. నగరంలోని జియాగూడకు చెందిన మధురవేణి, రమేశ్ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. చిన్న కూతురు శ్రీలత (26)ను 2021లో సైదాబాద్ నివాసి, ఎల్‌బీనగర్ సర్కిల్ కార్యాలయంలో బిల్ కలెక్టర్‌గా పనిచేసే మామిడి సాయిభార్గవ కృష్ణకు ఇచ్చి కట్నకానుకలతో వివాహం జరిపించారు. వీరికి ఏడాదిన్నర చిన్నారి శాన్వి ఉంది. రెండు నెలలుగా బడంగ్‌పేట గాయత్రిహిల్స్‌లో సొంత ఇల్లు నిర్మించుకుని నివాసముంటున్నారు. ఈక్రమంలో కొంతకాలంగా అదనపు కట్నం కోసం భర్త, అత్త కలిసి శ్రీలతను వేధిస్తున్నారు. దీంతో మనస్తాపం చెందిన ఆమె సోమవారం సాయంత్రం ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియాకు తరలించారు. తమ కూతురు ప్రస్తుతం నాలుగు నెలల గర్భిణి అని, అదనపు కట్నం వేధింపులతోనే ఆత్మహత్య చేసుకుందని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



మంతటి శంకరమ్మ మిద్దెపై తోట

ఇంటిపై పంట!

పండ్లు, కూరగాయ తోటల పెంచాలంటే కనీసం ఎకరం భూమి ఉండాలి.. నీటి వసతి తప్పని సరి.. విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు సరే సరి.. అయితే తాండూరుకు చెందిన కొంతమంది మహిళలు అందుబాటులో ఉన్న వనరులను వినియోగించుకొని మిద్దె తోటలకు శ్రీకారం చుట్టారు. సేంద్రియ సాగు చేస్తూ ఔరా అనిపిస్తున్నారు.

మిద్దెలపై పండ్లు, కూరగాయలు పండిస్తున్న గృహిణులు

- సేంద్రియ ఎరువులు, తక్కువ ఖర్చుతో దిగుబడి
- సమయం కేటాయిస్తే చాలంటున్న మహిళలు

తాండూరు టౌన్: ఇంటి ఆవరణలో పూల మొక్కల పెంపకం అందరూ చేసేదే. కానీ ఈ మహిళలు ఏకంగా తమ ఇంటి మిద్దెలనే తోటలుగా మార్చేశారు. ఉన్న కాసింత స్థలంలో వందలాది రకాల మొక్కలను పెంచడం విశేషం. సేంద్రియ ఎరువులను మాత్రమే వేస్తూ, ఆరోగ్య పరమైన ఎన్నో చిట్కాలను పాటిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణపై మక్కువ పెంచుకున్న వారు కృత్రిమ ఎరువుల వాడకుండా పండ్లు, కూరగాయల పంటలు సాగు చేస్తూ వాటినే భుజిస్తున్నారు. కరోనా కష్టకాలం తర్వాత ఆరోగ్య రక్షణపై ఎక్కువగా దృష్టి సారించిన వీరు, ఏకంగా మిద్దెపై తోటనే పెంచేశారు.

ఏళ్ల తరబడిగా..

ఏ మాత్రం శ్రమ అనుకోకుండా ఏళ్ల తరబడి నుంచి మిద్దెలపై పండ్లు, పూలు, కూరగాయలు, ఔషధ మొక్కలను పెంచేస్తున్నారు తాండూరు పట్టణానికి చెందిన మంతటి శంకరమ్మ, మంకాల సరిత, కీర్తి శర్మ. గృహిణులుగా ఉంటునే వారు చదివిన చదువును మొక్కల పెంపకానికి ఉపయోగిస్తున్నారు. మొక్కలు పెరగడానికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పిస్తూ, జీవామృతం, లీఫీ కంపోస్టు, వర్మీ కంపోస్టు వంటి సేంద్రియ ఎరువులను స్వయంగా తయారు చేస్తూ మొక్కల పెరుగుదలకు వినియోగిస్తున్నారు. ఇంట్లోని పనికి రాని వస్తువులను కుండీలుగా, స్టాండ్లుగా తయారు చేసి వాటిలో మొక్కలను పెంచుతున్నారు.

కూరగాయలు పండిస్తూ..

కాకర, సొరకాయ, గుత్తి బీరకాయ,వంకాయ, బెండకాయ, పాలకూర, తోటకూర, కొత్తిమీర, పూదీన వంటి కూరగాయలు, ఆకుకూరలు..క్రోటన్, టచ్‌మి నాట్,ఆర్నమెంట్ ప్లాంట్స్, ఏకబిల, మహా బిల, ఉడ్ ఆపిల్ వంటి ప్యాషన్ మొక్కలు, అంజీర, తైవాన్ జామ, మామిడి, జామ, వాటర్ ఆపిల్, స్టార్ ఆపిల్, ఉసిరి, డ్రాగన్ ఫ్రూట్, ద్రాక్ష, పెర్సిమన్, అరటి వంటి పండ్ల మొక్కలు, డాలియా, చామంతి, మందారం, తామర వంటి పూల మొక్కలు, తులసి,ఇ న్సులిన్ ప్లాంట్ వంటి ఔషధ గుణాలు గల మొక్కలు పెంచుతున్నారు.మొక్కల పెంపకానికి పెద్దగా ఖర్చు కాకపోయినా, సమయం మాత్రం కేటాయించాల్సి ఉంటుంది. మిద్దె మీదకు పచ్చని మొక్కలను చూస్తుంటే ఎంతో సంతోషంగా ఉంటుందని, మానసిక ప్రశాంతత లభిస్తుందని పలువురు ఆకులు, వ్యర్థాలను తొలగించి, వాటినే ఎరువుగా వినియోగిస్తున్నట్లు చెప్పారు.



జూబ్లీ వేడుకలు చేస్తా

చిన్ననాటి నుంచే మొక్కలను పెంచడం అలవాటు. 1975 నుంచి మిద్దెపై మొక్కలు పెంచుతున్నా. వీటి పెంపకానికి త్వరలో 50 ఏళ్లు పూర్తవుతుంది. మిద్దె తోటకు గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహిస్తా. నేను పండించే పండ్లు, కూరగాయలనే ఆహారంగా తీసుకుంటాం. తోటలోకి వస్తే గంటల సమయం గడిచినా తెలియదు. ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. మానసిక ప్రశాంతత దొరుకుతుంది.

– మంతటి శంకరమ్మ, గృహిణి

సహజ ఎరువులు..

నేను కొన్నేళ్లుగా మిద్దెపై మొక్కలు పెంచుతున్నా. ఇంట్లో పనికిరాని వస్తువులతో స్టాండ్స్, కుండీలు చేయించి వాటిలో మొక్కలను పెంపకానికి వినియోగిస్తున్నా. రసాయనిక ఎరువులు కాకుండా జీవామృతాన్ని స్వయంగా తయారు చేసి మొక్కలకు వేస్తుంటాను. నేటి కల్తీ ప్రపంచంలో సహజ ఎరువులతో పండించిన పండ్లు, కూరగాయలు తినడం ఆరోగ్యదాయకం.

– మంకాల్ సరిత, గృహిణి





పెద్దగా ఖర్చు రాదు

కొన్నేళ్లుగా ఇంటి ఆవరణలో మొక్కలు పెంచుతున్నా. పండ్లు, కూరగాయలు, ఔషధ గుణాలున్న మొక్కలు ఉన్నాయి. ఫ్యాషన్ మొక్కలు కూడా ఉన్నాయి. వీటి పెంపకానికి పెద్దగా ఖర్చేమీ కాదు.. కాస్త సమయం మాత్రం కేటాయించాలి ఉంటుంది. ఈ ఏడాది 40 వరకు డ్రాగన్ ఫ్రూట్స్ వచ్చాయి. పర్యావరణ పరిరక్షణకు ఇలాంటి తోటలను ఇంటి వద్ద పెంచుకోవాలి. ఒకసారి అలవాటైతే ఇక వదలలేం. మనసుకు ఎంతో ఉల్లాసాన్ని ఇస్తుంది.

– కీర్తిశర్మ, కరస్పాండెంట్, టీపీఎస్ స్కూల్

ఉద్యోగ భద్రత కల్పించాలి

డీడీఎన్ఎస్ అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవశర్మ

కొడంగల్ రూరల్: ప్రజల యోగక్షేమాలు కోరుతూ దేవదేవుళ్లకు నిత్య కైంకర్యాలు నిర్వహిస్తున్న దూప దీప నైవేద్య అర్చకుల(డీడీఎన్ఎస్)కు కనీస వేతనంతో కూడిన ఉద్యోగ భద్రత కల్పించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దౌల్తాబాద్ వాసుదేవశర్మ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం పట్టణంలోని కేఎస్‌వీ ఫంక్షన్ హాల్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు లోకూర్తి జయతీర్థాచారి అధ్యక్షతన జిల్లా అర్చకులతో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి పెండింగ్ వేతనాల గురించి వివరించడం జరిగిందని, వెంటనే బకాయి వేతనాలు విడుదల చేయడం సంతోషంగా ఉందన్నారు. అలాగే అర్చకుల సమస్యలను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకుందామని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో 15 వందల మంది అర్చకులను కొత్తగా నియమించే అవకాశం ఉందన్నారు. ప్రతి అర్చకుడు ఆలయ నిబంధనలు పాటిస్తూ భక్తులకు ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కన్వీనర్ హరికీర్తన అమరేశ్వర్, జిల్లా కార్యదర్శి కరణం శ్రీకాంత్, అర్చకులు పాల్గొన్నారు.

జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

డీడీఎన్ఎస్ జిల్లా నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా లోకూర్తి జయతీర్థాచారి, గౌరవ అధ్యక్షుడిగా బీ కళ్యాణరావు, ఉపాధ్యక్షులుగా జగదీశ్వర్‌స్వామి(కొడంగల్), శివానందస్వామి(తాండూరు), శ్రీకాంతాచారి(వికారాబాద్), ఎం రాజశేఖర్ మందిపల్(పరిగి), ప్రధాన కార్యదర్శిగా కరణం శ్రీకాంత్(మోత్కూర్), సహాయ కార్యదర్శులుగా గొర్వార్ రాఘవేందర్(ఊటుపల్లి), జంగం సంతోష్‌కుమార్(తాండూరు), జ్యోషి సత్యనారాయణరావు (బొంరాస్‌పేట), మఠం నాగరాజు, కల్కోడ, కోశాధికారిగా అఖిలేష్‌స్వామి(వికారాబాద్), సలహాదారులుగా అక్కి శ్రీనివాసమూర్తి, నటరాజస్వామి, వెంకటయ్య(అమ్రాది), శేఖరయ్య, గౌరీశంకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



వాసుదేవశర్మను సన్మానిస్తున్న జిల్లా కార్యవర్గ సభ్యులు

గద్దర్ ఆశయాలను కొనసాగిద్దాం

చేవెళ్ల: ప్రజా యుద్ధ నౌక గద్దర్ ఆశయాలను కొనసాగిద్దామని ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శి మహేశ్, జిల్లా అధ్యక్షుడు బి.ప్రభాకర్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గద్దర్ మొదటి వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తాడిత పీడిత ప్రజలకోసం నిరంతరం పోరాడి, ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన పోరాట యోధుడు గద్దర్ అని కొనియాడారు. జీవితంలో ఎన్నో కష్టనష్టాలు ఎదుర్కొని ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పేద ప్రజల సమస్యలను తన పాటతో ప్రశ్నించారన్నారు. గిరిజన ఆదివాసి భూమి హక్కుల కోసం వీరోచిత పోరాటం చేశారన్నారు. ఆయన ఆశయసాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అల్లవాడ మాజీ ఎంపీటీసీ సత్యనారాయణచారి, జిల్లా ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యం, టి.ప్రవీణ్, కోశాధికారి ఎం.వినోద్, మండల అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్ పాల్గొన్నారు.

జయశంకర్ ఆశయ సాధనకు కృషి



జయశంకర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

అనంతగిరి: ప్రతిఒక్కరూ ప్రొఫెసర్ జయశంకర్ ఆశయ సాధనకు కృషి చేయాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జయశంకర్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమానికి తన జీవితాన్ని అంకితం చేశారని, రాష్ట్ర ఆవశ్యకతను ప్రపంచానికి చాటి చెప్పిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

తండ్రీకొడుకులను కాటేసిన పాము


- అర్ధరాత్రి గాఢనిద్రలో ఉండగా ఘటన
- కుమారుడి పరిస్థితి విషమం



సోమ్లానాయర్



దినేశ్



దోమ: నిద్రిస్తున్న తండ్రీకొడుకులను పాము కాటేసిన ఘటన దోమ మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బుద్లాపూర్ తండాకు చెందిన సోమ్లానాయర్‌కు ఇద్దరు కుమారులు కాగా, చిన్న కొడుకు చిన్నతనంలోనే బకెట్‌లోని నీళ్లలో పడి మృత్యువాత పడ్డాడు. దీంతో పెద్ద కొడుకు దినేశ్‌ను అల్లారుముద్దుగా చూసుకుంటున్నారు. రోజూ మాదిరిగానే సోమవారం రాత్రి భోజనం చేసిన అనంతరం నిద్రకు ఉపక్రమించారు. అర్ధరాత్రి సమయంలో సోమ్లానాయర్ కాలికి ఏదో కుట్టినట్లు అనిపించింది. మంటగా ఉన్న కాలును పరిశీలించగా కాట్లు కనిపించాయి. ఆ వెంటనే దినేశ్ సైతం లేచి తన కాలు నొప్పిగా ఉందని చెప్పడంతో.. పడుకున్న దుస్తులను తీస్తుండగా కట్ల పాము కనిపించింది. సోమ్లా వెంటనే దాన్ని చంపేశాడు. విషయం తెలియడంతో ఇంటికి చేరుకున్న స్థానికులు తండ్రీకొడుకులను పరిగిలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. దినేశ్ పరిస్థితి విషమంగా ఉండటంతో వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాలని సిబ్బంది సూచించారు. ఆలోపు ఆస్పత్రికి చేరుకున్న బంధువులు బాలుడిని వికారాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

పర్యావరణాన్ని పరిరక్షిస్తేనే మనుగడ

షాబాద్: పచ్చదనం, వాతావరణ సమతుల్యానికి మొక్కలు నాటాలని, రోగాలు దరిచేరకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్ పేర్కొన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలోని పైల్వాన్ చెరువు, మిషన్ భగీరథ వాటర్ ట్యాంకులు, శ్మశానవాటిక, డంపింగ్‌యార్డులను ఎంపీడీఓ అపర్ణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సెగ్రిగేషన్ షెడ్‌ను తనిఖీ చేసి తడి, పొడి చెత్తను వేరు చేసి కంపోస్టు తయారు చేయాలని సూచించారు. నెల రోజుల్లో కంపోస్టు ఎరువులు తయారు చేసి తనకు ఫొటోలు పంపించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పర్యావరణాన్ని పరిరక్షిస్తేనే మానవ మనుగడ ఉంటుందన్నారు. మొక్కలు నాటి అడవులను పెంచేందుకు కృషి చేస్తే భవిష్యత్‌తరాల వారికి ఎంతో మేలు చేసినవారం అవుతామన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలన్నారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, చెత్త, డ్రైనేజీలో మురుగు నిల్వకుండా, పిచ్చి మొక్కలు, పొదలు తొలగించాలన్నారు. వాటర్ లీకేజీలుంటే సరిచేయాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని, ఓవర్‌హెడ్ వాటర్ ట్యాంకులను షె డ్యూల్ ప్రకారం శుభ్రం చేయించాలని ఆదేశించారు.

నీటి నాణ్యతను నిత్యం పరీక్షించాలి



మీర్జాపూర్ పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న అనితారామచంద్రన్, కలెక్టర్ ప్రతీక్‌జైన్

పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ అనితారామచంద్రన్

పూడూరు: వర్షాలు పడుతున్నందున నీటి నాణ్యతను నిత్యం పరీక్షించాలని పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ అనితారామచంద్రన్ అధికారులకు సూచించారు. స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని మీర్జాపూర్, సోమన్‌గుర్తి పాఠశాలలను కలెక్టర్ ప్రతీక్‌జైన్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శుద్ధి చేసిన నీటిని సరఫరా చేసి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని సూచించారు. తాగునీటి సరఫరా వ్యవస్థను మరింతగా మెరుగు పరచాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబల కుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలల్లో పచ్చదనం కోసం మొక్కలు పెంచాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే రోగాలు దరిచేరవన్నారు. ప్రతి తరగతి గదిలో ఫ్యాన్, లైట్ ఉండాలని, మరుగుదొడ్లు, మూత్రశాలలను శుభ్రంగా ఉంచాలన్నారు. మిషన్ భగీరథ నీటి నాణ్యతను స్వయంగా పరిశీలించారు. తాగునీటి పైప్‌లైన్లు లీకేజీ కాకుండా చూసుకోవాలని, వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించాలని ఆదేశించారు. అనంతరం జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ సుధీర్, డీఆర్‌డీఏ శ్రీనివాస్, డీపీఓ జయసుధ, మిషన్ భగీరథ ఈఈ బాబు శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, ఎంపీడీఓ పాండు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీఐకి డీజీపీ ప్రశంస



సీఐ శ్రీధర్‌రెడ్డికి ప్రశంసాపత్రం అందజేస్తున్న డీజీపీ జితేందర్

కొడంగల్ రూరల్: కొడంగల్ సీఐగా పని చేస్తున్న శ్రీధర్‌రెడ్డి సంగారెడ్డిలో పనిచేస్తున్న సమయంలో ఓ మహిళా హత్య కేసును ఛేదించినందుకు మంగళవారం డీజీపీ అభినందించారు. ఈ మేరకు డీజీపీ జితేందర్ నగరంలోని తన కార్యాలయంలో సీఐ శ్రీధర్‌రెడ్డికి ప్రశంసా పత్రం అందించారు. సంగారెడ్డిలో విధులు నిర్వహిస్తున్న సమయంలో మహిళను హత్య చేసి గోనె సంచిలో వేసి చెరువు కట్ట దగ్గర వేశారు. ఈ కేసుకు సంబంధించి కొద్ది రోజుల్లోనే నిందితున్ని పట్టుకొని చార్జిషీటు దాఖలు చేయడంతో నిందితుడికి న్యాయస్థానం యావజ్జీవ శిక్ష విధించింది. ఈ మేరకు కేసును ఛేదించిన సీఐని అభినందించారు.

మీర్‌పేటలో అదృశ్యం తిరుపతిలో ప్రత్యక్షం

మీర్‌పేట: మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో అదృశ్యమైన బాలుడు తిరుపతిలో ప్రత్యక్షమయ్యాడు. ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపిన ప్రకారం జిల్లెలగూడ దాసరి నారాయణరావు కాలనీకి చెందిన మధుసూదన్‌రెడ్డి కుమారుడు మహిధర్‌రెడ్డి ఆదివారం మధ్యాహ్నం ట్యూషన్‌కు వెళ్తున్నాని బయలుదేరి మార్గమధ్యలో లిఫ్ట్ ద్వారా మీర్‌పేట బస్టాప్ వద్దకు చేరుకుని బస్సులో మలక్‌పేట రైల్వేస్టేషన్ వద్ద దిగి అక్కడ రైలు ఎక్కిన విషయం విదితమే. తల్లిదండ్రుల ఫిర్యాదుతో మీర్‌పేట పోలీసులు నాలుగు బృందాలుగా ఏర్పడి గాలింపు చేపట్టారు. మహిధర్‌రెడ్డి కుటుంబ సభ్యులది కర్నూల్ కావడంతో అక్కడికే వెళ్లి ఉంటాడని ముందుగా పోలీసులు భావించినప్పటికీ మహిధర్‌రెడ్డి నేరుగా తిరుపతి వెళ్లి వేంకటేశ్వర స్వామిని దర్శనం చేసుకున్నాడు. అనంతరం ఓ వ్యక్తి వద్ద సెల్‌ఫోన్ తీసుకుని తాను తిరుపతి వచ్చానని, తిరిగి వస్తున్నానని తెలుపగా వెంటనే తల్లిదండ్రులు విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. మీర్‌పేట పోలీసులు తిరుపతి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. అక్కడే ఉన్న తమ బంధువులకు అప్పగించాలని కోరినా పోలీసులు అంగీకరించలేదని బాలుడి తండ్రి తెలిపాడు. ప్రస్తుతం మహిధర్‌రెడ్డి తిరుపతి పోలీసుల సంరక్షణలోనే ఉన్నాడని, రేపటి వరకు బాలుడిని నగరానికి తీసుకొస్తామని ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపారు.

వృద్ధుడిని ఢీకొట్టిన కారు

ఓఆర్‌ఆర్‌పై ప్రమాదం

శంషాబాద్ రూరల్: దారితప్పిన వృద్ధుడు ఓఆర్‌ఆర్‌పై రోడ్డు దాటుతున్నాడు.. ఇదే సమయంలో వేగంగా వచ్చిన కారు అతడిని బలంగా ఢీకొనడంతో ఎగిరి కారుపై పడ్డాడు. దీంతో కారు అద్దంలో వృద్ధుడి తల ఇరుక్కుని మొండెం నుంచి వేరు పడింది. ఇన్‌స్పెక్టర్ కె.నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని కొత్వాల్‌గూడకు చెందిన తోట్ల అంజయ్య(65) నాలుగు రోజుల కిందట ఊట్‌పల్లిలోని సోదరుడు పాపయ్య ఇంటికి వెళ్లాడు. సోమవారం రాత్రి ఊట్‌పల్లి నుంచి స్వగ్రామానికి వెళ్లడానికి బయలుదేరాడు. నడుచుకుంటూ వెళ్తూ దారి తప్పాడు. తొండుపల్లి వద్ద ఉన్న ఔటర్ రింగురోడ్డు జంక్షన్ నుంచి పైకి చేరుకున్నాడు. అక్కడ రోడ్డు దాటుతుండగా.. గచ్చిబౌలి నుంచి తుక్కుగూడ వైపు వెళ్తున్న కారు అతడిని బలంగా ఢీకొంది. దీంతో ఎగిరి పడటంతో తల అద్దంలో ఇరుక్కుపోయింది. కారు వేగంతో ముందుకు వెళ్లడంతో తల నుంచి మొండెం వేరు పడింది. డ్రైవర్ వెంటనే కారు ఆపి పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనా స్థలానికి చేరుకున్న శంషాబాద్ పోలీసులు వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. ప్రమాదానికి కారణమైన కారును సీజ్ చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసులు

చైతన్యపురి: రాఖీ పౌర్ణమి సందర్భంగా తమిళనాడులోని అరుణాచలం గిరి ప్రదక్షిణకు హైదరాబాద్–2 డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ కృష్ణమూర్తి తెలిపారు. ఈనెల 17వ తేదీ రాత్రి 7.15 గంటలకు దిల్‌సుఖ్‌నగర్ నుంచి బస్సు బయలుదేరి కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ మీదుగా అరుణాచలం చేరుకుంటుందన్నారు.

రేషన్ బియ్యం పక్కదారి!

లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యాన్ని చౌకకు కొనుగోలు చేసి, వాటిని బడా వ్యాపారులకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు కొంత మంది దళారులు. ఆ బియ్యాన్ని కర్ణాటకకు యథేచ్ఛగా తరలిస్తున్నారు.

- పట్టుబడుతున్నా ఆగని అక్రమాలు
- కర్ణాటకకు చేరుతున్న పేదోడి బియ్యం
- పట్టించుకోని అధికార యంత్రాంగం



పెద్దేముల్‌లో పట్టుబడిన రేషన్ బియ్యం (ఫైల్)



పెద్దేముల్: పేదల ఆకలితీర్చే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ బియ్యాన్ని అందిస్తున్నాయి. కానీ గ్రామీణ ప్రాంతాల్లో రేషన్ బియ్యం పక్కదారి పడుతోంది. మూడు పువ్వులు ఆరు కాయలు అన్న చందంగా అక్రమ వ్యాపారం జోరుగా సాగుతుంది. తాండూరు నియోజకవర్గంలోని పెద్దేముల్, యాలాల, బషీరాబాద్ మండలాల్లో రేషన్ బియ్యాన్ని వాహనాల్లో అక్రమంగా తరలిస్తుండగా చాలాసార్లు పోలీసులు పట్టుకుని సీజ్ చేసి, కేసులు నమోదు చేశారు. అయినా అక్రమ వ్యాపారం ఆగటం లేదు. బియ్యం పట్టుకుంటున్నారని, నూకలుగా మార్చి విక్రయాలు జరుపుతున్నట్లు గ్రామాల్లో ప్రచారం. ఏది ఏమైనా ఉచిత బియ్యం పథకం లక్ష్యం నీరు గారుతోంది.

కిలోకి రూ.8–10

పెద్దేముల్ మండలంలో 29 రేషన్ దుకాణాలు, సుమారు 12,029 రేషన్ కార్డులుండగా, వీటి ద్వారా 41,098 మంది లబ్ధిదారులున్నారు. ప్రతి నెలా సుమారు 2,46,588 కిలోల బియ్యం సరఫరా అవుతుంది. గ్రామాల్లో కొంత మంది దళారులు ప్రతి నెలా రేషన్ బియ్యాన్ని కిలోకి రూ.8 నుంచి రూ.10 వరకు ఖరీదు చేసి పెద్ద వ్యాపారస్తులకు విక్రయాలు చేస్తున్నారు. గత రెండు నెలలుగా రేషన్ బియ్యం దందా జోరుగా సాగుతుంది. ఇటీవల పెద్దేముల్ మండలంలో మన్‌సాన్‌పల్లి, బుద్దారం, కందనెల్లి గ్రామాల సమీపంలో పోలీసులు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం వాహనాలను పట్టుకొని సీజ్ చేసి, కేసులు నమోదు చేసిన సంఘటనలున్నాయి. ఆరు నెలల క్రితం యాలాల మండలంలో అక్రమంగా తరలిస్తున్న 100 క్వింటాళ్ల బియ్యాన్ని పోలీసులు పట్టుకొని సీజ్ చేశారు.

మన బియ్యం కర్ణాటకలో..

మండలానికి కర్ణాటక రాష్ట్రం సరిహద్దుగా ఉండటంతో అక్రమార్కులకు కలిసి వస్తోంది. తెలంగాణ బియ్యాన్ని కొంత మంది దళారులు పక్క రాష్ట్రంలోని కుంచారం, సేడెంతో పాటు బీదర్‌కు తరలించి కాసులు దండుకుంటున్నారు. దీనికి ప్రధాన కేంద్రంగా తాండూరు పట్టణాన్ని మార్చుకొని, అక్కడే పెద్ద ఎత్తున నిల్వలు చేసి బియ్యం తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. కానీ ఈ వ్యాపారం ఎవరు చేస్తున్నారు. అందులో ఎవరి ప్రమేయం ఉంది. వీరికి వెనకాల నుంచి సాయం చేస్తుంది ఎవనేది తెలియకపోవటం కొసమెరుపు. గతంలో రేషన్ కార్డుల ద్వారా అందజేస్తున్న బియ్యం అసలైన లబ్ధిదారులకు అందకుండా పక్కదారి పడుతుందని భావించిన ప్రభుత్వం బయోమెట్రిక్ విధానాన్ని ప్రవేశ పెట్టింది. అయినా కూడా రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం ఆగటం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం అక్రమ రేషన్ దందా వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కఠిన చర్యలు

ఈ విషయమై తహసీల్దార్ కిషన్‌ను వివరణ కోరగా.. రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం జరుగుతున్న విషయం తమ దృష్టికి రాలేదని పేర్కొన్నారు. పేదొడి బియ్యం అక్రమంగా తరలిస్తే తప్పకుండా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ఎవరైనా రేషన్ బియ్యం విక్రయాలు చేస్తున్నట్లు ఉంటే సమాచారం తమకు ఇవ్వాలని ఆయన కోరారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పారదర్శకంగా ఉపాధి పనులు

డీఆర్‌డీఓ శ్రీనివాస్



సామాజిక తనిఖీలో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ శ్రీనివాస్

మర్పల్లి: మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనులు పారదర్శకంగా నిర్వహించాలని డీఆర్‌డీఓ శ్రీనివాస్ సూచించారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రాజ్‌మల్లయ్య అధ్యక్షతన ఏపీడీ సరళ, అంబుడ్స్‌మెన్ గుర్రం రాములు సమక్షంలో సామాజిక తనిఖీని స్టేట్ రిసోర్స్ పర్సన్, డీఆర్‌పీలు నిర్వహించారు. 2023 ఏప్రిల్ ఒకటి నుంచి 2024 మార్చి 31 వరకు గాను మండలంలోని 27 గ్రామ పంచాయతీలలో వివిధ పనులకు రూ.9.99 కోట్లు ఖర్చు పెట్టారు. వాటిని ఏ విధంగా ఖర్చు పెట్టారనే వివరాలను డీఆర్‌పీలు గ్రామాల్లో గత వారం రోజులుగా పని ప్రదేశాలకు వెళ్లి వివరాలు సేకరించారు. పలు గ్రామాల్లో సోషల్ ఆడిట్ బృందం గుర్తించిన సమస్యలను, దుర్వినియోగం అయిన డబ్బులు, అందుకు బాధ్యులైన ఉపాధి సిబ్బందిపై ఓపెన్ ఫోరంలో అధికారుల ముందు డీఆర్‌పీలు చదివి వినిపించారు. అధికారులు నిధుల దుర్వినియోగం చేసిన ఉపాధి సిబ్బందిని రికవరీ కోసం ఆదేశించారు. రాత్రి 9 గంటల వరకు 23 గ్రామ పంచాయతీలకు సంబంధించి ఆడిట్ పూర్తి కాగా మరో 4 గ్రామ పంచాయతీలకు కొనసాగుతున్నాయి. ఆడిట్ పూర్తయిన తరువాత ఎంత మేరకు అవినీతి జరిగింది? ఎంత రికవరీ చేయాలి, అందుకు బాధ్యులైన సిబ్బందిపై ఎలాంటి చర్యలు తీసుకోవాలనేది తరువాత చెబుతామన్నారు. కార్యక్రమంలో ఏవీఎం భార్గవి, ఎస్‌ఆర్‌పీ జీవన్, ఏపీఓ అంజిరెడ్డి, ఈసీ విఠల్, పంచాయతీ కార్యదర్శులు, డీఆర్‌పీలు, ఆయా గ్రామాల టీఏలు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఎఫ్‌ఏలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్య సేవలే లక్ష్యం

జిల్లా వైద్యాధికారి పాల్వన్‌కుమార్



ఆస్పత్రి ఆవరణలో మొక్క నాటి నీళ్లు పోస్తున్న పాల్వన్‌కుమార్

దోమ: పేదలకు నాణ్యమైన వైద్య సేవలను అందించడమే తమ లక్ష్యమని జిల్లా వైద్యాధికారి పాల్వన్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంపును ఆయన ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో క్యాన్సర్ రోగులను గుర్తించడం కోసం జిల్లాలో ఆరు క్యాంపులను నిర్వహించుటకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఇందులో భాగంగానే దోమ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. క్యాన్సర్ అనుమానితుల గోప్యత పాటించి, వైద్యాధికారులతో పరీక్షలు నిర్వహించి పాజిటివ్ ఉన్న వారిని ఉన్నత శ్రేణి ఆస్పత్రికి తరలించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆస్పత్రి ఆవరణలో మొక్క నాటారు. మందులు నిల్వ గది, డెలివరీ వార్డుల్లో ఉంచాల్సిన పరికరాలు, జనరేటర్ లాంటి సమస్యలను ఆయన దృష్టికి సిబ్బంది తీసుకొచ్చారు. వాటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ శివరాజు, ప్రోగ్రాం అధికారులు పవిత్ర, నేహా, నిరోష, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిని రజిత, ఎంపీడీఓ మహేశ్‌బాబు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాలికతో అసభ్య ప్రవర్తన

వృద్ధుడికి మూడేళ్ల జైలు

రంగారెడ్డి కోర్టులు: మైనర్ బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన కేసులో నిందితుడైన సంగెపు హనుమంత రావు(60)కు మూడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా ప్రత్యేక పోక్సో కోర్టు న్యాయమూర్తి యం.కె.పద్మావతి తీర్పునిచ్చారు. కోర్టు పీపీ సునీత తెలిపిన వివరాల ప్రకారం.. మైనర్ బాలిక తన కుటుంబసభ్యులతో కలిసి ఎల్‌బీనగర్ ఠాణా పరిధిలో నివాసం ఉంటోంది. 2018 ఏప్రిల్ 23వ తేదీన బాలిక ఇంటి ఎదుట ఆడుకుంటుండగా అదే భవనంలో నివాసం ఉండే 60ఏళ్ల వృద్ధుడు హనుమంతరావు బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. గమనించిన బాలిక తల్లి ఎల్‌బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించికోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా, విచారించిన కోర్టు మంగళవారం పైవిధంగా శిక్ష ఖరారు చేస్తూ తీర్పును ఇచ్చింది. బాధితురాలికి రూ.లక్ష పరిహారం మంజూరు చేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థకు సిఫార్సు చేసింది.

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

పట్టణ సీఐ సంతోష్‌కుమార్

తాండూరు టౌన్: వాహనదారులు తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పట్టణ ఇన్‌స్పెక్టర్ సంతోష్ కుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మోటార్ వెహికల్ చట్టం ప్రకారం కొత్త వాహనం కొనుగోలు చేసిన 30 రోజుల లోపు రిజిస్ట్రేషన్ చేయించాలన్నారు. అలాగే నిబంధనల ప్రకారమే నంబర్ ప్లేట్ అమర్చాలన్నారు. వాహన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండటంతో పాటు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. కార్ల అద్దాలకి బ్లాక్ ఫిల్మ్ వేయించరాదన్నారు. 18 ఏళ్ల లోపు పిల్లలు డ్రైవింగ్ చేయరాదని, పరిమితికి మించి వాహనాల్లో ప్రయాణించరాదని, మద్యం తాగి వాహనాలు నడపరాదని చెప్పారు. ట్రిపుల్ రైడింగ్, మితిమీరిన వేగం, నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడపటం వంటివి చేయరాదన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

తాండూరు రూరల్: మండల పరిధిలోని మల్కాపూర్ గ్రామంలో మంగళవారం పేకాటరాయుళ్లను పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌ఐ విఠల్‌రెడ్డి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన తుల్జప్ప, అమృతయ్య, గోపాల్, పండరి, లక్ష్మప్ప, గోవింద్, తుల్జరాంగౌడ్, రాజు, గైబప్ప, నర్సింలు శివారులో పేకాట ఆడుతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు కరనోట్ పోలీసులు పేకాట స్థావరానికి వెళ్లి జూదరాయుళ్లను పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ.8,900 నగదు, రెండు పేకాట సెట్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంపై కేసు నమోదు

కుల్కచర్ల: అతివేగంగా వచ్చిన కారు ఓ బైక్‌ను ఢీకొట్టిన ప్రమాదంపై కేసు నమోదైన ఘటన కుల్కచర్ల మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 4న ఉదయం మండలంలోని బండవెల్కిచర్ల గ్రామ శివారులో గుర్తు తెలియని కారు కుల్కచర్ల నుంచి దాదాపూర్ వెళ్తున్న క్రమంలో కోస్గి నుంచి పాంబండకు బైక్‌పై వస్తున్న కేశవులు, రాములును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న కేశవులు తలకు తీవ్రగాయమైంది. అనంతరం అతన్ని నగరంలోని గాంధీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ విషయమై బాధితుడి కుమారుడు శ్రీనివాస్ వేగంగా కారును నడిపిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ అన్వేష్‌రెడ్డి తెలిపారు.

ఐకేపీ సీసీపై కేసు నమోదు

ధారూరు: తనను శారీరకంగా, మానసికంగా వేధించిన సీసీ(కమ్యూనిటీ కోఆర్డినేటర్)పై తగిన చర్యలు తీసుకోవాలని తరిగోపులకు చెందిన మహిళా వీఓఏ ధారూరు పీఎస్‌లో మంగళవారం ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ వేణుగోపాల్ గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బాధిత మహిళ తొమ్మిదేళ్లుగా వీఓఏగా పనిచేస్తోంది. పదేళ్ల క్రితం ఆమె భర్త చనిపోయారు. ఇటీవల గ్రామానికి సీసీగా మోహన్ వచ్చారు. ఉద్యోగ రీత్యా ఉన్న చనువును ఆసరాగా చేసుకుని ఆమెను తరచూ శారీరకంగా, మానసికంగా వేధించేవాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

గర్భిణులు మానసిక ప్రశాంతతో ఉండాలి



పోషకాహార కిట్లను అందజేస్తున్న డాక్టర్ అనుపమరెడ్డి

కొడంగల్ రూరల్: గర్భం దాల్చిన మహిళలు ఎల్లవేళలా మానసిక ప్రశాంతతో ఉండే విధంగా కుటుంబసభ్యులు చూసుకోవాలని శ్రీరామకృష్ణ మఠం ఆర్య జనని ప్రోగ్రాం సభ్యులు డాక్టర్ అనుపమరెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని శ్రీరాఘవేంద్ర ఫంక్షన్‌హాల్‌లో రామకృష్ణ సేవా సమితి, కొడంగల్ లయన్స్ క్లబ్ సంయుక్తంగా గర్భిణులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనుపమరెడ్డి సూచనలిచ్చారు. గర్భిణిగా ఉన్న సమయంలో తల్లి అనుసరించాల్సిన సూచనలు, పండంటి బిడ్డను పొందడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ధ్యానం, యోగా శ్రావ్యమైన గానంతో ఒత్తిడిని తగ్గించుకునేందుకు కృషి చేయడంతో బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా పుట్టేందుకు అవకాశం ఉంటుందని వివరించారు. క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. అనంతరం మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ మాట్లాడుతూ.. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం హర్షించదగ్గ విషయమని కొనియాడారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యుడు డాక్టర్ దాసప్పయాదవ్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రవీంద్రయాదవ్, ఎంఈఓ రాంరెడ్డి, రామకృష్ణ సేవా సమితి సభ్యులు చంద్రశేఖర్, ఆనంద్‌బ్రదర్స్, గోపాల్, విద్యావంతుల వేదిక రవీందర్‌గౌడ్, సీడీపీఓ కృష్ణవేణి, ప్రవీణ్, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛదనంలో భాగస్వాములవ్వాలి

ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి



వీధులను పరిశీలిస్తున్న శిక్షణ కలెక్టర్

దౌల్తాబాద్: స్వచ్ఛదనం–పచ్చదనంలో ప్రజలందరూ భాగస్వాములై, గ్రామాలను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలని ట్రైనీ కలెక్టర్ ఉమహారతి సూచించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా రెండో రోజు మంగళవారం కుప్పగిరి, దౌల్తాబాద్ గ్రామాల్లో ట్రైనీ కలెక్టర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈ నెల 9వ తేదీ వరకు కొనసాగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ప్రజాప్రతినిధులు, సామాన్య పౌరులను భాగస్వామం చేయాలన్నారు. గ్రామాల్లో రోజు చెత్త సేకరణ, పరిసరాల పరిశుభ్రత, మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలన్నారు. అలాగే దౌల్తాబాద్‌లో ప్రతి వార్డులో తిరిగి సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

బిడ్డల మరణంతో తల్లి మనస్తాపం

- పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం
- ఆస్పత్రికి తరలిస్తుండగా మృత్యువాత



జ్యోతి మృతదేహం

బంట్వారం: ఇద్దరు కుమార్తెలు మరణించడంతో మనస్తాపం చెందిన ఓ తల్లి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన బంట్వారం మండలం సల్బత్తాపూర్‌లో చోటు చేసుకుంది. ఏఎస్సై నజీర్ అహ్మద్‌బేగ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన లొంక జ్యోతి(25)కి ఆరేళ్ల క్రితం సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం మనియార్‌పల్లికి చెందిన బేగరి రాచయ్యతో ప్రేమ వివాహం జరిగింది. అయితే పెళ్లయినప్పటి నుంచి జ్యోతి పుట్టింట్లోనే ఉంటోంది. రాచయ్య అప్పుడప్పుడూ సల్బత్తాపూర్‌కు వచ్చి వెళ్లేవాడు. వీరికి నాలుగేళ్ల క్రితం తొలి కాన్పులో పుట్టిన చిన్నారి కొద్ది రోజులకే మరణించింది. అనారోగ్యం బారిన పడిన రెండో కూతురు సైతం గత మే నెలలో చనిపోయింది. ఇద్దరు బిడ్డలను కోల్పోయిన జ్యోతి తీవ్ర మానసిక ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగి స్పృహ కోల్పోయింది. కొద్ది సేపటికి తర్వాత ఇంటికి వచ్చిన తల్లి సావిత్రి.. స్థానికుల సాయంతో జ్యోతిని వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో చనిపోయింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసిన పోలీసులు, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

క్రీడలతోనే మానసికోల్లాసం



విద్యార్థికి ప్రశంసాపత్రం అందజేస్తున్న అధికారులు, పోలీసులు

కొడంగల్ రూరల్: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని, తద్వారా విద్యార్థులు చదువులో చక్కగా రాణించేందుకు అవకాశం ఉంటుందని ఎస్‌ఐలు సత్యనారాయణ, గోపాల్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణ శివారులోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో కరాటే శిక్షణా కార్యక్రమంలో భాగంగా ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కరాటేతో ఆత్మరక్షణతో పాటు ఆరోగ్యంగా ఉండేందుకు వీలుంటుందన్నారు. అనంతరం స్పెషల్ ఆఫీసర్ స్రవంతి మాట్లాడుతూ.. 2016 నుంచి పాఠశాలలో కరాటే శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా యూత్ క్రీడా అధికారి హనుమంతరావు ఆదేశాల మేరకు నెల రోజులపాటు కరాటే మాస్టర్ కరీం ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించినట్లు వివరించారు. కార్యక్రమంలో కరాటే మాస్టర్ దత్తు, ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

కుల్కచర్ల ప్రత్యేకాధికారి వెంకటయ్య



ఆస్పత్రి పైభాగాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కుల్కచర్ల: విధి నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి అవకాశం ఇవ్వొద్దని కుల్కచర్ల మండలం ప్రత్యేకాధికారి వెంకటయ్య పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆయన తనిఖీ చేశారు. ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య, గ్రామాల్లో వస్తున్న వ్యాధులను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రి భవనం పైభాగాన పెరిగిన పిచ్చి మొక్కలు, డ్రైనేజీ నీరు బయటకు రావడం పట్ల అసహనాన్ని వ్యక్తం చేశారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందికి సూచించారు. ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పిస్తూ, గ్రామాల్లో వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మురళీధర్, ఎంపీడీఓ రామకృష్ణ, వైద్యురాలు మాధురి, మెడికల్ అసిస్టెంట్ వెంకట్, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బస్సులు పెంచాలని ధర్నా



యాలాల: ఆందోళన చేస్తున్న విద్యార్థులు

ఆర్టీసీ డిపో ఎదుట బైఠాయించిన విద్యార్థులు

యాలాల: గ్రామాల్లో ఆర్టీసీ బస్సు సర్వీసులు పెంచాలని విద్యార్థులు ఆందోళన చేపట్టారు. మండల పరిధిలోని చెన్నారం మీదుగా అక్కంపల్లి, పగిడిపల్లి, జుంటుపల్లి, రుద్రారం గ్రామాలకు వెళ్లే బస్సుల సంఖ్యను పెంచాలని మంగళవారం బీసీ సంఘం ఆధ్వర్యంలో తాండూరు ఆర్టీసీ డిపో ఎదుట విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీసీ సంఘం మండల అధ్యక్షుడు లక్ష్మణాచారి మాట్లాడుతూ.. ఆయా గ్రామాల నుంచి సుమారు 150 మంది విద్యార్థులు నిత్యం తాండూరుకు ఉన్నత విద్య కోసం రాకపోకలు సాగిస్తుంటారన్నారు. ఈ మార్గంలో సాయంత్రం వేళ బస్సులు లేకపోవడంతో విద్యార్థులు ఇళ్లకు వెళ్లేసరికి చీకటి పడుతుందన్నారు. దీంతో విద్యార్థునులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ మార్గంలో బస్సుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం డిపో మేనేజర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీసీ సంఘం మండల కార్యదర్శి ప్రసాద్‌గౌడ్, నరేశ్, అశోక్, అభిలాశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

సమయానికి బస్సులు నడపండి

తాండూరు రూరల్: పాఠశాల, కళాశాలల సమయానికి బస్సులు నడపాలని విద్యార్థులు కోరుతున్నారు. మండలంలోని గుంతబాసుపల్లి గ్రామం నుంచి మోడల్ స్కూల్‌తో పాటు తాండూరు పట్టణానికి కళాశాలలకు విద్యార్థులు నిత్యం వెళ్తారు. రోజూ ఉదయం 9 గంటలకు రావాల్సిన బస్సు 10 గంటలకు వస్తోందని విద్యార్థులు ఆవేదన చెందుతున్నారు. సమయానికి బస్సులు రాకపోవడంతో ఆలస్యంగా వెళుతున్నామని పేర్కొంటున్నారు. దీంతో మంగళవారం ఉదయం 10 గంటలకు గ్రామానికి వచ్చిన బస్సు ఎదుట నిలబడి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. అనంతరం గ్రామానికి చెందిన దస్తయ్యగౌడ్ మా తాండూరు డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు.



తాండూరు రూరల్: గుంతబాసుపల్లిలో బస్సు ఎదుట నిరసన చేపట్టిన విద్యార్థులు, గ్రామస్తులు